సాక్షి
నిజామాబాద్
శనివారం । 11 । జనవరి । 2025




నగరంలోని జెండా బాలాజీ ఆలయం వద్ద బారులు తీరిన భక్తులు

న్యూస్‌రీల్

కాకతీయ కాలువ ద్వారా పెరిగిన నీటి విడుదల

బాల్కొండ: శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి వారబందీ ప్రకారం కాకతీయ కాలువ ద్వారా నీటి విడుదలను 3,500 క్యూసెక్కుల నుంచి 5,500 క్యూసెక్కులకు పెంచారు. ప్రాజెక్ట్ నుంచి వరద కాలువ ద్వారా 5 వేల క్యూసెక్కులు, సరస్వతి కాలువ ద్వార 700 క్యూసెక్కులు, లక్ష్మికాలువ ద్వారా 250 క్యూసెక్కులు విడుదల చేస్తున్నారు. అలీ సాగర్ లిఫ్ట్ ద్వారా 525 క్యూసెక్కులు, గుత్ప లిఫ్ట్ ద్వారా 270 క్యూసెక్కులు, ముంపు గ్రామాల లిఫ్టుల ద్వారా 312 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 416 క్యూసెక్కులు, మిషన్ భగీరథకు 231 క్యూసెక్కులు వదులుతున్నారు. ప్రాజెక్ట్ పూర్తిస్థాయి నీటిమట్టం 1091(80.5 టీఎంసీలు) అడుగులు కాగా శుక్రవారం సాయంత్రానికి 1086.70(65.5 టీఎంసీలు) అడుగుల నీరు నిల్వ ఉందని ప్రాజెక్ట్ అధికారులు పేర్కొన్నారు.

నిజాంసాగర్ నుంచి రెండో విడత..

నిజాంసాగర్: ఆయకట్టు అవసరాల కోసం శుక్రవారం నిజాంసాగర్ ప్రాజెక్టు నుంచి రెండో విడత నీటి విడుదలను ప్రారంభించినట్లు నీటిపారుదలశాఖ అధికారులు తెలిపారు. ప్రధాన కాలువకు వెయ్యి క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

రేపు జిల్లాస్థాయి హ్యాండ్‌బాల్ ఎంపికలు

నిజామాబాద్ నాగారం: జిల్లా హ్యాండ్‌బాల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 12న మాక్లూర్ జిల్లా పరిషత్ స్కూల్‌లో ఎంపికలు నిర్వహిస్తున్నట్లు అధ్యక్ష, కార్యదర్శులు గంగమోహన్, సురేందర్ తెలిపారు. ఉదయం 10 గంటలకు జూనియర్ బాలుర విభాగంలో ఎంపికలు ఉంటాయని పేర్కొన్నారు. 01-01-2005 నుంచి 31-12-2008 మధ్య జన్మించిన వారు అర్హులన్నారు. ఇందులో ప్రతిభ చూపిన వారిని రాష్ట్రస్థాయికి ఎంపిక చేస్తామన్నారు. ఆసక్తి గల వారు గట్టడి రాజేష్ (9642535535, 9440441757)ను సంప్రదించాలని సూచించారు.

నేటి నుంచి సెలవులు

నిజామాబాద్ అర్బన్: సంక్రాంతి సెలవులు శనివారం నుంచి ప్రారంభం కానున్నాయి. జిల్లాలోని అన్ని యాజమాన్య పాఠశాలల్లో ఈ నెల 17 వరకు సెలవులు కొనసాగుతాయి.

మెప్మా ఆర్పీలకు గౌరవ వేతనం విడుదల

నిజామాబాద్ సిటీ: మెప్మాలో పనిచేస్తున్న రిసోర్సు పర్సన్‌లకు గౌరవ వేతనం (హానరోరియం) ప్రభుత్వం విడుదల చేసింది. ఈ నెల 3న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఆర్పీల అసోసియేషన్ నాయకులు కలిసి వినతి పత్రం సమర్పించారు. దీంతో జూన్ 2024 నుంచి నవంబర్ 2024 వరకు చెల్లించాల్సిన గౌరవ వేతనాన్ని ప్రభుత్వం శుక్రవారం విడుదల చేసింది. దీంతో ఆర్పీలు ముఖ్యమంత్రికి రేవంత్‌రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.



మానవసేవే మాధవసేవ

సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: మానవసేవే మాధవసేవ అని, ప్రతి ఒక్కరూ ఎదుటివారికి సహాయం చేస్తే సమస్యలు పరిష్కారమవుతాయని మైసూరు దత్తపీఠాధిపతి గణపతి సచ్చిదానంద స్వామీజీ అన్నారు. ముక్కోటి ఏకాదశి పర్వదినం పురస్కరించుకుని శుక్రవారం స్వామీజీ ఇందూరులోని ఉత్తర తిరుపతి క్షేత్రానికి వచ్చి భక్తులకు ప్రవచనాలు ఇచ్చారు. ప్రతిఒక్కరూ భక్తిభావం అలవర్చుకోవాలన్నారు. భక్తిభావంతోనే సమాజం శ్రేయస్కరంగా ఉంటుందన్నారు. క్రమశిక్షణతో జీవనవిధానం కొనసాగించాలన్నారు. పుణ్యక్షేత్రాల వద్ద భక్తులు క్రమశిక్షణతో ఉండాలన్నారు. తొక్కిసలాట లాంటి ఘటనలు చోటుచేసుకోకుండా చూసుకోవాలన్నారు. తిరుపతిలో దుర్ఘటన చోటుచేసుకోవడం దురదృష్టకరమన్నారు. వైకుంఠ ఏకాదశి నుంచి పదిరోజుల పాటు దర్శనాలు చేసుకోవచ్చన్నారు. పరమాత్ముని అనుగ్రహం లభిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తర తిరుపతి ఆలయ ఫౌండర్ ట్రస్టీ సంపత్, మైసూరు పీఠం మేనేజరు రమేష్ పాల్గొన్నారు.

ఆలయాలకు 'వైకుంఠ' శోభ


వైకుంఠ ఏకాదశి సందర్భంగా జిల్లాలోని వైష్ణవ ఆలయాలు శుక్రవారం భక్తులతో కిటకిటలాడాయి. ఉదయం నుంచే భక్తులు ఉత్తర ద్వార దర్శనం కోసం ఆలయాలకు బారులు తీరారు. జిల్లాలోని ఉత్తర తిరుపతి, ఇందూరు తిరుమల, జెండా బాలాజీ ఆలయం, సుభాష్ నగర్ రామాలయంలో స్వామి వారిని భక్తులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా భక్తులకు ఇబ్బందులు కల్గకుండా ఏర్పాట్లు చేశారు.



నర్సింగ్‌పల్లి ఇందూరు తిరుమలలో గరుడ వాహనంపై స్వామివారి ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

ఎమ్మెల్సీ వేడి షురూ

- అభ్యర్థులను ప్రకటించిన బీజేపీ
- పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా అంజిరెడ్డి
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా కొమరయ్య
- కాంగ్రెస్ మద్దతు కోసం ప్రయత్నిస్తున్న అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి, మదనం గంగాధర్
- బీఆర్‌ఎస్ తరఫున బరిలోకి దిగేందుకు డాక్టర్ బీఎన్ రావు ప్రయత్నాలు



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్: ఆదిలాబాద్–నిజామాబాద్–కరీంగనర్–మెదక్ పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీల ఎన్నికల వేడి షురూ అయింది. స్థానిక సంస్థల ఎన్నికల విషయమై చర్చ నడుస్తున్న నేపథ్యంలో బీజేపీ గురువారం అభ్యర్థులను ప్రకటించింది. పార్టీ జాతీయ అధ్యక్షుడు జగత్ ప్రకాష్ నడ్డా ఆదేశాల మేరకు రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థిగా సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరువుకు చెందిన సి అంజిరెడ్డిని, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థిగా పెద్దపల్లి జిల్లా బంధంపల్లికి చెందిన మల్క కొమరయ్యను ప్రకటించారు. బీఏ మ్యాథ్స్ పట్టభద్రుడైన అంజిరెడ్డి వివిధ రంగాల్లో పెట్టుబడులు పెట్టారు. పారిశ్రామికవేత్తగా ఉన్నారు. ఎస్ఆర్ ట్రస్ట్ ద్వారా గత 20 సంవత్సరాలుగా గ్రామాల్లో తాగునీటి సరఫరా చేస్తున్నారు. పేద విద్యార్థులకు మెరుగైన విద్యనందించేందుకు కృషి చేస్తున్నారు. అంజిరెడ్డి సతీమణి గోదావరి బీజేపీ సంగారెడ్డి జిల్లా అధ్యక్షురాలిగా ఉన్నారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి బీఈ సివిల్ ఇంజినీరింగ్ పట్టా అందుకున్న మల్క కొమరయ్య హైదరాబాద్‌లో ఢిల్లీ పబ్లిక్ స్కూల్ స్థాపించారు. పెద్దపల్లి, నిర్మల్, హైదరాబాద్‌లో పల్లవి విద్యాసంస్థలను నిర్వహిస్తున్నారు. కొమరయ్య గత లోక్‌సభ ఎన్నికల్లో మల్కాజ్‌గిరి టిక్కెట్ కోసం ప్రయత్నం చేశారు. టికెట్ రాకపోవడంతో ఈటల రాజేందర్ గెలుపు కోసం కృషి చేశారు. ప్రధాన పార్టీల నుంచి మొదటగా బీజేపీ తన అభ్యర్థులను బరిలోకి దించడంతో ఎమ్మెల్సీ ఎన్నికల వేడి మొదలైంది. ఈ నియోజకవర్గం పరిధిలో బీజేపీకి నలుగురు ఎంపీలు, ఏడుగురు ఎమ్మెల్యేలు ఉన్నారు. ఇది తమకు కలిసొస్తుందని అంజిరెడ్డి, కొమరయ్య భావిస్తున్నారు.

■ కరీంనగర్‌కు చెందిన డాక్టర్ బీఎన్ రావు ఇండియన్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేశారు. అదేవిధంగా బీఎన్ రావు ఫౌండేషన్ ద్వారా సేవా కార్యక్రమాలు చేస్తున్నారు. పలు ప్రాంతాల్లో క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలు చేయిస్తున్నారు. ప్రతి నెల కొందరికి కీళ్ల మార్పిడి చేస్తున్నారు. కోవిడ్ సమయంలో శానిటైజర్లు, మాస్కులు పంపిణీ చేశారు. గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. పలు విద్యాసంస్థల్లో వాటర్ ప్లాంట్‌లు ఏర్పాటు చేశారు. బీఎన్ రావు బీఆర్‌ఎస్ తరఫున బరిలోకి దిగేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

■ కరీంనగర్‌కు చెందిన అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత నరేందర్‌రెడ్డి పట్టభద్రుల ఎమ్మెల్సీ కోసం రెండు నెలలుగా ప్రచారం చేసుకుంటున్నారు. నాలుగు ఉమ్మడి జిల్లాల్లో ఫ్లెక్సీలు, హోర్డింగ్‌లు ఏర్పాటు చేశారు. అదేవిధంగా సోషల్ మీడియా ద్వారా విస్తృత ప్రచారం చేస్తున్నారు. ఇక పోలీసు శాఖలో డీఎస్పీ ఉద్యోగాన్ని వదిలేసి వచ్చిన నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌కు చెందిన మదనం గంగాధర్ సైతం పట్టభద్రుల ఎమ్మెల్సీ బరిలోకి వచ్చారు. గంగాధర్ సైతం రెండు నెలలుగా నాలుగు జిల్లాల్లో తిరుగుతూ స్వతంత్రంగా ప్రచారం చేస్తున్నారు. బిచ్చమెత్తుకునే స్థాయి నుంచి మొదలై బాలకార్మికుడిగా పనిచేసి డీఎస్పీ స్థాయి వరకు వచ్చిన గంగాధర్ స్వచ్ఛందంగా ఉద్యోగాన్ని వదిలేశారు. పబ్లిక్ సర్వీస్ కమిషన్ గ్రూప్–1 పేపర్ లీకేజీ నిందితులను పట్టుకునే విషయంలోనూ గంగాధర్ క్రియాశీలక పాత్ర పోషించారు. అయితే అల్ఫోర్స్ నరేందర్‌రెడ్డి, మదనం గంగాధర్ కాంగ్రెస్ పార్టీ మద్దతు కోసం గట్టి ప్రయత్నాలు చేస్తున్నారు.

ఎత్తొండ విండోలో అవకతవకలు



విచారణ నివేదిక చదువుతున్న జిల్లా కో ఆపరేటీవ్ సీనియర్ ఇన్‌స్పెక్టర్ పుష్ప

- సుమారు రూ.8 కోట్ల రికవరీకి సిఫార్సు

రుద్రూర్: కోటగిరి మండలం ఎత్తొండ సింగిల్ విండో భారీగా అవకతవకలు జరిగినట్లు సహకార అధికారుల నివేదికలో వెల్లడైంది. ఎత్తొండ విండో లావాదేవీలపై కొందరు సభ్యుల ఫిర్యాదు మేరకు సహకార అధికారులు విచారణ జరిపారు. శుక్రవారం ఎత్తొండ విండో ఆవరణలో ఏర్పాటు చేసిన సంఘ సభ్యుల సమావేశంలో విచారణ నివేదికను జిల్లా సహకార సీనియర్ ఇన్‌స్పెక్టర్ పుష్ప వెల్లడించారు. సివిల్ సప్లయి కార్పొరేషన్‌కు బియ్యం సరఫరాలో నిర్లక్ష్యం చేయడం, విండో లావాదేవీల నిర్వహణలో కార్యదర్శి, పాలక వర్గం విఫలం కావడంతో రూ.8 కోట్ల 70వేల నష్టం వాటిల్లిందని వెల్లడించారు. దీనిని విండో మాజీ అధ్యక్షుడు, ప్రస్తుత కార్యదర్శి, పాలకవర్గం నుంచి రికవరి చేయాలని పేర్కొన్నారు. విండో రికార్డుల నిర్వహణ సరిగా లేనందున రూ.6.32 లక్షలు దుర్వినియోగం అయినట్లు గుర్తించారు. ఈ డబ్బులను కార్యదర్శి, మాజీ విండో చైర్మన్ ద్వారా రికవరీ చేయాలని సిఫార్సు చేశారు. సస్పెన్స్ ఖాతా కింద డ్రా చేసిన రూ.లక్ష 60వేలు సెల్స్‌మేన్, మాజీ అధ్యక్షుడి ద్వారా రికవరీ చేయాలన్నారు.

రికార్డుల నిర్వహణ అస్తవ్యస్తం

విండో లావాదేవీలకు సంబంధించి రికార్డులు, ఖాతా పుస్తకాల నిర్వహణలో సంఘం విఫలమైందని విచారణలో వెల్లడైంది. ఎరువుల ముగింపు స్టాక్‌లో ఉన్న వ్యత్యాసాన్ని గుర్తించి సరి చేయాలన్నారు. రికార్డులు సక్రమంగా నిర్వహించాలని, బైలా ప్రకారం విండో కార్యకలాపాలు చేయాలని, విండోలో ప్రస్తుతం 21 మంది ఉద్యోగులు ఉన్నందున తగ్గించాలని సూచనలు చేశారు.

రికవరీ చేయాల్సిందే..

సంఘం నష్టాల్లో కూరుకుపోవడానికి బాధ్యులైన వారి నుంచి రికవరీ చేయాలని సభ్యులు డిమాండ్ చేశారు. గత ఐదేళ్ల కాలానికి సంబంధించి కూడా సెక్షన్ 51 కింద విచారణ జరపాలని కొందరు సభ్యులు కోరారు. సంఘం అభివృద్ధి చెందిందని సంతోషించామని, భారీ నష్టాల్లో ఉన్న విషయాన్ని గుర్తించలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు.

సీఎం సమావేశానికి హాజరైన కలెక్టర్

నిజామాబాద్‌అర్బన్: రాష్ట్ర సచివాలయంలో శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డి జిల్లా కలెక్టర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి జిల్లా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు హాజరయ్యారు. వివిధ అంశాలపై సీఎం సమీక్షించారు.



సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ హనుమంతు

పచ్చి పసుపు వాపస్!

- మార్కెట్ యార్డుకు పంట తీసుకొచ్చిన రైతులు
- బాగా ఎండిన పసుపు తీసుకు రావాలని అధికారుల సూచన

సుభాష్‌నగర్: నిజామాబాద్ వ్యవసాయ మార్కెట్ యార్డుకు ఇద్దరు రైతులు తీసుకొచ్చిన పచ్చి పసుపు విక్రయాలను శుక్రవారం అధికారులు నిలిపేశారు. కమ్మర్‌పల్లి మండలంలోని హాసాకొత్తూరు, ఉప్పలూరుకు చెందిన ఇద్దరు రైతులు 95 బస్తాల పచ్చి పసుపును శ్రీ ఆంజనేయ ట్రేడర్స్, శ్రీ సత్యనారాయణ ట్రేడర్స్‌లోకి తీసుకొచ్చారు. విషయాన్ని గమనించిన మార్కెట్ కమిటీ అధికారులు పచ్చి పసుపును ఈ–నామ్‌లో ట్రేడింగ్‌కు అనుమతించలేదు. పంటను ఎవరూ కొనుగోలు చేసే వ్యాపారులు ముందుకు రాకపోవడంతో రైతులు వాపస్ తీసుకెళ్లే పరిస్థితి వచ్చింది. పచ్చి పసుపును మార్కెట్‌కు తీసుకొచ్చి రైతులు ఇబ్బందులకు గురికావొద్దని తెలిపారు. చైర్మన్ ముప్ప గంగారెడ్డి ఆదేశాల మేరకు పచ్చి పసుపును తిరస్కరిస్తున్నట్లు స్పష్టంచేశారు. కావున రైతులు ఈవిషయాన్ని గమనించి, బాగా ఎండబెట్టిన పసుపు మాత్రమే మార్కెట్‌కు తీసుకురావాలని చైర్మన్, అధికారులు కోరుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నా..

నిజామాబాద్ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో ప్రచార రథాల ద్వారా ఉమ్మడి నిజామాబాద్, ఆదిలాబాద్, కరీంనగర్ జిల్లాల్లో అవగాహన కల్పిస్తున్నారు. బాగా ఎండిన పసుపును మార్కెట్‌కు తీసుకు రావాలని విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. అయినప్పటికీ కొందరు రైతులు పచ్చి పసుపును తీసుకొచ్చారు. తేమ శాతం 12 వరకు ఉండేలా పసుపును తీసుకొస్తే రూ.10వేలకు మించి ధర వచ్చే బాధ్యత మార్కెట్ కమిటీ తీసుకుంటుందని రైతాంగానికి భరోసానిస్తుంది.



మార్కెట్ యార్డుకు రైతులు తీసుకొచ్చిన పసుపు

మార్గదర్శకాలు వస్తేనే భరోసాపై స్పష్టత

- రైతు భరోసాకు మరోసారి దరఖాస్తు చేసుకోవాలని ప్రచారం
- తమకు సమాచారం లేదంటున్న వ్యవసాయ శాఖ
- సాగు భూములకే ఇస్తామంటున్న ప్రభుత్వం



మోర్తాడ్(బాల్కొండ): ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు జారీ అయితేనే రైతు భరోసాపై స్పష్టత రావడంతోపాటు క్షేత్రస్థాయిలో వివిధ రకాల ప్రచారానికి తెరపడుతుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గత యాసంగి సీజన్‌లో పాత పద్ధతిలోనే రైతు భరోసాను అమలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం వర్షాకాలం సీజన్‌లో ఎలాంటి సాయం అందించలేదు. ప్రస్తుత యాసంగి సీజన్‌కు రైతు భరోసాను అమలు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం గత నిబంధనలను సవరించనున్నట్లు స్పష్టం చేసింది. క్షేత్రస్థాయిలో మాత్రం రైతు భరోసా కోసం మరోసారి దరఖాస్తు చేసుకోవాలనే ప్రచారం జోరుగా జరుగుతోంది. ఒక వేళ రైతుల నుంచి మరోసారి దరఖాస్తులు స్వీకరిస్తే, వాటి పరిశీలన, ఇతర చర్యలకు సమయం వృథా అవుతుందనే వాదన వినిపిస్తోంది.

తగ్గనున్న లబ్ధిదారుల సంఖ్య

గత బీఆర్‌ఎస్ ప్రభుత్వం రైతుబంధు పథకం అమలులో ఇష్టారాజ్యంగా వ్యవహరించిందని కాంగ్రెస్ ప్రజాప్రతినిధులు, నాయకులు విమర్శిస్తున్నారు. లే అవుట్‌కు సిద్ధం చేసిన స్థలాలు, నాలా కన్వర్షన్ చేసిన భూములు, కొండలు, గుట్టలు, మైనింగ్‌కు కేటాయించి భూములు, రియల్ ఎస్టేట్ వెంచర్లు, పరిశ్రమలు, ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాల కోసం కొనుగోలు చేసిన భూములకు రైతుబంధు వర్తింప చేశారని ఆరోపిస్తున్నారు. ఈ కారణంగా కోట్లాది రూపాయలు పక్కదారి పట్టాయని అంటున్నారు. జిల్లాలో 2,73,595 మంది రైతులకు రూ.271.44 కోట్ల నిధులను రైతుబంధు కింద మంజూరు చేశారు. అప్పట్లో ఒక్కో సీజన్‌లో ఎకరానికి రూ.5వేల చొప్పున పెట్టుబడి సాయం విడుదల చేసేవారు. అయితే పెట్టుబడి సాయాన్ని ఒక సీజన్‌కు ఎకరానికి రూ.6 వేలకు పెంచి సాగులో ఉన్న భూములకే ఇస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు.

పెట్టుబడి సాయం పెరిగినా సాగుకు యోగ్యమైన, సాగులో ఉన్న భూములకే రైతు భరోసా అందించడం ద్వారా లబ్ధిదారుల సంఖ్యతోపాటు నిధుల పరిమాణం తగ్గే అవకాశం ఉంది.

ఆదేశాలు రాలేదు..

రైతుభరోసా అమలుపై ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రావాల్సి ఉంది. కొత్తగా దరఖాస్తులు స్వీకరించాలనే ఆదేశాలు ఇంకా అందలేదు. గతంలో సేకరించిన వివరాలు ఉన్నాయి. అందులో సాగుకు యోగ్యమైన భూములు ఎన్ని ఉన్నాయో పంటల నమోదు ద్వారా తెలుస్తుంది. వివరాలు ఎలా ఉన్నా ప్రభుత్వం గైడ్‌లైన్స్ ఇవ్వాల్సిందే. **– శ్రీనివాస్‌రావు, వ్యవసాయ సంచాలకులు, భీమ్‌గల్**

షరతులు లేకుండా ఇవ్వాలి



గతంలో ప్రతి సీజన్‌లో ఎకరానికి రూ.5వేల చొప్పున పెట్టుబడి సాయం అందించారు. ఫలితంగా సాగు విస్తీర్ణం పెరిగింది. పెట్టుబడి సాయం కారణంగా రైతులకు ప్రోత్సాహం అందింది. ఇప్పుడు నిబంధనలను సవరించడం పేరుతో కాలయాపన చేయడం తగదు. ఎలాంటి షరతులు లేకుండా రైతు భరోసా అందించాలి. **– పాపాయి పవన్, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్, మోర్తాడ్**

రైతులను మోసం చేస్తున్నారు



తాము అధికారంలోకి రాగానే పెట్టుబడి సాయాన్ని ఎకరానికి రూ.7,500 చొప్పున ఒక్కో సీజన్‌లో అందిస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చింది. ఇప్పటి వరకు పాత పద్ధతిలోనైనా రైతులందరికీ అందించి ఉంటే బాగుండేది. రైతులకు కల్లబొల్లి మాటలు చెప్పి మోసం చేయడం సరికాదు. పెట్టుబడి సాయం అందించి రైతులను ఆదుకోవాలి. **– కొలిప్యాక ఉపేంద్ర, మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు, ఏర్గట్ల**

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

నిజామాబాద్ అర్బన్: ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాలని జిల్లా ఇంటర్ విద్యాధికారి రవికుమార్ సూచించారు. శుక్రవారం ఆయన తన కార్యాలయంలో జూనియర్ కాలేజీల ప్రిన్సిపాళ్లతో సమావేశం నిర్వహించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి సంక్రాంతి సెలవుల తర్వాత ఉదయం, సాయంత్రం ప్రత్యేక తరగతులు నిర్వహించాలని సూచించారు. ఇంటర్ బోర్డు కమిషనర్ ఆదేశం మేరకు 90 రోజుల ప్రణాళికను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. ఇదివరకే సిలబస్ పూర్తి చేసినందున మరోసారి రివిజన్‌తో పాటు ప్రాక్టికల్స్ పూర్తి చేయాలన్నారు. ప్రయోగశాలలో అవసరమైన ముడి పదార్థాలను సమకూర్చుకోవడానికి ఇంటర్ బోర్డు డబ్బులు సమకూరుస్తుందన్నారు. ప్రయోగశాలలు సిద్ధం చేయాలని, ప్రతి కళాశాలలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. వార్షిక పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు పక్కా ప్రణాళికతో ముందుకు సాగాలన్నారు. కళాశాలలకు హాజరు కాని విద్యార్థులను రప్పించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులకు అర్థం కాని విషయాలను మళ్లీ మళ్లీ చెప్పాలన్నారు.



మాట్లాడుతున్న ఇంటర్ విద్యాధికారి రవికుమార్

క్లుప్తంగా

ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీలో డాక్టరేట్



గణేశ్‌బాబు

తెయూ(డిచ్‌పల్లి): తెలంగాణ యూనివర్సిటీ ఫార్మాస్యూటికల్ కెమిస్ట్రీ విభాగంలో పరిశోధక విద్యార్థి బాతుల గణేశ్ బాబు డాక్టరేట్ సాధించారు. అసోసియేట్ ప్రొఫెసర్ వాసం చంద్రశేఖర్ పర్యవేక్షణలో 'ప్రిపరేషన్ అండ్ క్యారక్టరైజేషన్ ఆఫ్ నానో స్ట్రక్చర్డ్ మిక్స్ డ్ మెటల్ ఆక్సైడ్ క్యాటలిస్ట్ ఫర్ ఏరోబిక్ యాక్సిడేషన్ ఆఫ్ ఆల్కల్స్ అండ్ కండెన్స్ ఆఫ్ ఆడేయిడ్స్' అనే అంశంపై గణేశ్ బాబు పరిశోధన పూర్తి చేసి సిద్ధాంత గ్రంథం సమర్పించారు. శుక్రవారం యూనివర్సిటీలో నిర్వహించిన బహిరంగ మౌఖిక పరీక్షకు జేఎన్‌టీయూహెచ్ ప్రొఫెసర్ డి. అశోక్ ఎక్స్ టర్నల్ ఎగ్జామినర్‌గా వ్యవహరించారు. సైన్స్ డీన్, ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ సీహెచ్ ఆరతి, కంట్రోలర్ ప్రొఫెసర్ ఎం అరుణ, అధ్యాపకులు బోయపాటి శిరీష, పర్యవేక్షకులు సత్యనారాయణరెడ్డి. ప్రసన్నశీల, కాంట్రాక్ట్ అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవ అలవర్చుకోవాలి



తెయూ (డిచ్‌పల్లి): విద్యార్థులు చదువుతో పాటు సమాజ సేవను అలవర్చుకోవాలని తెలంగాణ యూనివర్సిటీ వీసీ ప్రొఫెసర్ టీ యాదగిరిరావు పిలుపునిచ్చారు. తెలంగాణ యూనివర్సిటీ మెయిన్ క్యాంపస్ ఆవరణలో కామారెడ్డి ఆర్ కే డిగ్రీ అండ్ పీజీ కాలేజ్ ఎన్ ఎస్ ఎస్ యూనిట్ వలంటీర్లు స్వచ్ఛ భారత్ కార్యక్రమాన్ని శుక్రవారం నిర్వహించారు. పరిపాలనాభవనం, కామర్స్ అండ్ మేనేజ్ మెంట్ కాలేజ్, బాయ్స్ హాస్టల్, గరల్స్ హాస్టల్ పరిసర ప్రాంతాల్లో పెరిగిన పిచ్చిమొక్కలు, ముళ్లపొదలు, గడ్డిని తొలగించారు. ప్లాస్టిక్ వ్యర్థాలను ఏరి పరిసరాలను శుభ్రం చేశారు. వీసీ ప్రొఫెసర్ టి యాదగిరిరావు, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ యాదగిరి వలంటీర్లను అభినందించారు. కార్యక్రమంలో తెయూ ఎన్ఎస్ఎస్ కో ఆర్డినేటర్ కే రవీందర్‌రెడ్డి, ఆర్‌కే డిగ్రీ అండ్ పీజీ కాలేజ్ సీఈవో ఎం జైపాల్‌రెడ్డి, డీన్ నవీన్ కుమార్, కో ఆర్డినేటర్ దత్తాద్రి, ప్రిన్సిపాల్‌లు సైదయ్య, గోవర్ధన్‌రెడ్డి, గంగాధర్, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్లు వెంకటేశ్వర్లు, లింగం, నర్సారెడ్డి, మురళి, రాజు, అధ్యాపక బందం, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్ జట్టుకు అభినందన



నిజామాబాద్‌నాగారం: ఎస్‌జీఎఫ్ రాష్ట్ర సాఫ్ట్ బాల్ జట్టు క్రీడాకారులను జిల్లా విద్యాశాఖాధికారి అశోక్ శుక్రవారం అభినందించారు. ఈనెల 5 నుంచి 9వ తేదీ వరకు మహారాష్ట్రలో నిర్వహించిన స్కూల్‌గేమ్స్ సాఫ్ట్ బాల్ అండర్-17 పోటీల్లో రాష్ట్ర బాలికల జట్టు తృతీయ స్థానం సాధించగా, జిల్లా క్రీడాకారులు కాంస్య పతకాలు అందుకున్నారు. క్రీడాకారులతోపాటు ఎస్‌జీఎఫ్ కార్యదర్శి నాగమణి, కోచ్, మేనేజర్లు మర్కంటి గంగామోహన్, సొప్పరి వినోద్,బి అంజలి, ప్రశాంత్‌ను డీఈవో సన్మానించి అభినందించారు. 20 ఏళ్ల తరువాత రాష్ట్ర జట్టు పతకం సాధించిందని నాగమణి తెలిపారు. రాష్ట్రజట్టులో జి సాత్విక (కెప్టెన్), జి శ్రావిక (టీఎస్‌డబ్ల్యూఆర్ఎస్, సుద్దపల్లి), ఎస్ నిత్యశ్రీ (జెడ్పీహెచ్ ఎస్, తొర్లికొండ), డి అశ్విని (జెడ్పీహెచ్ఎస్, ముచ్కూర్) కీలకపాత్ర పోషించారన్నారు.

డైట్ సూపరింటెండెంట్‌కు ఏడీగా పదోన్నతి

నిజామాబాద్‌అర్బన్: నాగారంలోని డైట్ కళాశాలలో సూపరింటెండెంట్‌గా పని చేస్తున్న వేణు గౌడ్‌కు శుక్రవారం పదోన్నతి లభించింది. ఆదిలాబాద్ జిల్లా విద్యాశాఖ కార్యాలయానికి అసిస్టెంట్ డైరెక్టర్‌గా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో మరో ముగ్గురికి సూపరింటెండెంట్లుగా పదోన్నతి కల్పిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

సొంతూరుకు చలో చలో..

బస్సు ఎక్కేందుకు పోటీపడుతున్న విద్యార్థులు, తల్లిదండ్రులు





తల్లితో కలిసి ఇంటికి బయల్దేరిన విద్యార్థిని



ఇంటికి వెళ్లేందుకు లగేజీతో ప్రధాన బస్టాండ్‌కు చేరుకున్న యువతి



కిటికీలో నుంచి బస్సు ఎక్కుతున్న విద్యార్థి



సంక్రాంతి సెలవులు రావడంతో విద్యార్థులు ఆనందంగా సొంతూళ్లకు బయల్దేరారు. హాస్టళ్లు, అద్దె గదెల్లో ఉంటూ చదువుకుంటున్న విద్యార్థు ఇళ్లకు వెళ్లిపోయారు. జిల్లా కేంద్రంలోని బస్టాండ్ విద్యార్థులు, వారి తల్లిదండ్రులతో కిటకిటలాడింది. బస్సుల్లో సీట్ల కోసం పోటీపడుతూ బస్సులు ఎక్కడి కనిపించింది. బస్టాండ్ ప్రాంగణం ప్రయాణికులతో కిక్కిరిసింది. – సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్–నిజామాబాద్



సీటు కోసం పోటీపడుతున్న దృశ్యం





కుటుంబ సభ్యులతో కలిసి ఇళ్లకు బయల్దేరిన విద్యార్థినులు



లగేజీ బ్యాగులతో బస్టాండ్‌లో విద్యార్థులు

మండలాలకు బీజేపీ కొత్త అధ్యక్షులు

సుభాష్‌నగర్: సంస్థాగత నిర్మాణంలో భాగంగా జిల్లాలోని 21 మండలాలకు నూతన అధ్యక్షులను నియమించినట్లు బీజేపీ ఎన్నికల అధికారి కాసం వెంకటేశ్వర్లు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ అర్బన్ నియోజకవర్గంలో ఆరు, రూరల్‌లో ఎనిమిది, ఆర్మూర్‌లో ఐదు, బోధన్, బాల్కొండ పరిధిలో ఒక్కో మండలానికి అధ్యక్షులను నియమించినట్లు వెల్లడించారు.

అధ్యక్షులు వీరే..

మండలం	అధ్యక్షుడు
ఖిల్లా రాంమందిర్	కోడూరు నాగరాజు
వినాయక్‌నగర్	ఇప్పకాయల కిశోర్
కంఠేశ్వర్	బాలపురం ఆనంద్‌రావు
పగడాల దుబ్బ	గడ్డం శంకర్ (రాజు)
దేవీమాత	తారక్ వేణుగోపాల్
ఎల్లమ్మ దేవి	మెట్టు విజయ్‌కుమార్
డిచ్‌పల్లి	కర్షి చంద్రకాంత్
మోపాల్	ఎన్ శశాంక్
ఇందల్‌వాయి	లోలం సత్యనారాయణ
జక్రాన్‌పల్లి	కోనేపల్లి ప్రసాద్
సిరికొండ	గుర్రం సంజీవ్‌రెడ్డి
ధర్పల్లి	జిర్ర మహిపాల్‌యాదవ్
నిజామాబాద్ రూరల్	మూల జనార్దన్‌రెడ్డి
సారంగపూర్ హనుమాన్	జంగిటి ఆనంద్
ఆర్మూర్ టౌన్	మందుల బాలకృష్ణ
ఆర్మూర్ రూరల్	సుంకరి వినోద్
మాక్లూర్	మదారి మమత
డొంకేశ్వర్	మగ్గిడి చిన్నారెడ్డి
ఆలూర్	సూర శ్రీకాంత్
ఎడపల్లి	కోల ఇంద్రకరణ్
భీమ్‌గల్ టౌన్	కనికరం మధు

తల్లి చనిపోయింది.. పినతల్లి బిచ్చమెత్తుకోమంది

- బాలికను బస్సెక్కించి ఊరి నుంచి పంపించేసిన ఇరుగుపొరుగు
- బోధన్ బస్టాండ్‌కు చేరుకున్న బాలిక.. స్వధార్ హోంకు తరలింపు

బోధన్‌టౌన్(బోధన్): కన్న తల్లి చనిపోయింది.. రెండో పెళ్లి చేసుకున్న నాన్న మానసిక స్థితి సరిగా లేక ఇంటి నుంచి వెళ్లిపోయాడు. ఒంటరైన ఆ బాలికను పినతల్లి బిచ్చమెత్తుకుని డబ్బులు తీసుకురావాలని వేధించింది. చిత్రహింసలు పడుతున్న ఆ బాలిక పరిస్థితిని చూస్తూ ఉండలేకపోయిన ఇరుగుపొరుగులు ఆమెను బస్సెక్కించి ఊళ్లో నుంచి పంపించేశారు. చివరకు అధికారుల సాయంతో ఆ బాలిక స్వధార్ హోంకు చేరుకుంది. ఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి. కోటగిరికి చెందిన సాయమ్మ అలియాస్ సావిత్రి (11) శుక్రవారం సాయంత్రం 6.30గంటల సమయంలో బోధన్ బస్టాండ్‌లో ఒంటరిగా కనిపించింది. గమనించిన లీగల్ సర్వీసెస్ అథారిటీ సిబ్బంది మహాలక్ష్మి పారా లీగల్ వలంటీర్ల(పీఎల్‌వీ)కు సమాచారం అందించగా అంగన్‌వాడీ టీచర్‌తో కలిసి బస్టాండ్‌కు చేరుకున్న పీఎల్‌వీలు ఎక్కడి నుంచి వచ్చావని బాలికను ప్రశ్నించగా.. తనది కోటగిరి అని, నాన్న పేరు పెశెట్టి అని తెలిపింది. తన తల్లి చనిపోవడంతో తండ్రి మరో పెళ్లి చేసుకున్నాడని, మానసిక స్థితి దెబ్బతినడంతో ఇంటి నుంచి వెళ్లిపోయాడని వివరించింది. తండ్రి వెళ్లిపోయిన తరువాత పినతల్లి తనను చిత్రహింసలు పెట్టిందని, బిచ్చమెత్తి డబ్బులు తీసుకురావాలని వేధించిందని తెలిపింది. తన పరిస్థితిని చూసి చుట్టుపక్కల వారు బోధన్ బస్సు ఎక్కించడంతో ఇక్కడికి చేరుకున్నానని సమాధానమిచ్చింది. దీంతో పోలీసులు సహాయం తీసుకుని పీఎల్‌వీ ప్రతినిధులు పద్మసింగ్, రమణారెడ్డి బాలికను స్వధార్ హోంకు చేర్చారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో టీచర్ మృతి



పాల వేణు(ఫైల్)

ఇందల్వాయి: మండలంలోని బీబీపూర్ తండా సమీపంలో 44వ నంబరు జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జిల్లా కేంద్రానికి చెందిన ప్రభుత్వ ఉపాధ్యాయుడు పాల వేణు(49) మృతి చెందాడు. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని కేకే తండా ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విధులు నిర్వర్తిస్తున్న వేణు శుక్రవారం ఉదయం నిజామాబాద్ నుంచి పాఠశాలకు బయల్దేరాడు. బీబీపూర్ తండా సమీపంలోకి చేరుకున్న సమయంలో వేణు నడుపుతున్న ద్విచక్రవాహనం అదుపు తప్పింది. గాయాలపాలైన వేణు చికిత్స నిమిత్తం స్థానికులు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. వేణు గతంలో పీఆర్టీయూ మండల అధ్యక్షుడిగా పని చేశారు. ఆయన భార్య సైతం ఉపాధ్యాయ వృత్తిలోనే ఉన్నారు. వీరికి ఇద్దరు పిల్లలు ఉన్నారు.

డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో నలుగురికి జైలు



ఖలీల్‌వాడి: డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో న్యాయస్థానం నలుగురికి జైలుశిక్ష, 16 మందికి జరిమానా విధించినట్లు ట్రాఫిక్ సీఐ ప్రసాద్ శుక్రవారం తెలిపారు. నగరంలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లో 20 మందికి కౌన్సెలింగ్ ఇచ్చిన అనంతరం సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ ఎదుట శుక్రవారం హాజరుపరిచామన్నారు. ముగ్గురికి రెండు రోజుల, ఒకరికి ఒక రోజు జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారని, అలాగే 16 మందికి మొత్తం రూ.25,500 జరిమానా విధించినట్లు సీఐ తెలిపారు.

నగరంలో రెండు చోట్ల చోరీ

ఖలీల్‌వాడి: నగరంలోని ఒకటో టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న ఓ వస్త్ర దుకాణంతోపాటు మెడికల్‌లో దుండగులు చోరీకి పాల్పడినట్లు ఎస్‌హెచ్‌వో రఘుపతి శుక్రవారం తెలిపారు. పూసలగల్లీలోని అరుణ ఫ్యాబ్రిక్స్‌లో నుంచి రూ.2.80 లక్షలు అలాగే ఖలీల్‌వాడిలోని ఓ మెడికల్‌లో నుంచి రూ.85 వేలు ఎత్తుకెళ్లారన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు. రెండు చోట్ల ఒకేతరహాలో చోరీ జరిగిందని, ఒకే ముఠాకు చెందిన వారు చోరీకి పాల్పడి ఉంటారని అనుమానించారు.

చెరువులో మహిళ మృతదేహం

రుద్రూర్: మండల కేంద్రంలోని ఊర చెరువులో గ్రామానికి చెందిన జూకంటి శారద(34) అనే మహిళ మృతదేహన్ని స్థానికులు శుక్రవారం గుర్తించారు. చెరువు కట్ట పైనుంచి వెళుతున్న స్థానికులు మృతదేహన్ని గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఎస్సై సాయన్న ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహన్ని బయటకు తీయించారు. గత కొంత కాలంగా శారద ఫిట్స్, కడుపు నొప్పితో బాధపడుతూ జీవితంపై విరక్తి చెంది చెరువులో దూకి ఆత్మహత్య చేసుకుందని మృతురాలి తల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

అనుమానాస్పదంగా తిరుగుతున్న మహిళపై దాడి

బాన్సువాడ : అనుమానాస్పదంగా తిరుగుతున్న ఓ మహిళపై స్థానికులు దాడి చేసి పోలీసులకు అప్పగించారు. ఈ ఘటన శుక్రవారం బాన్సువాడ పట్టణంలోని పాత వీక్లీ మార్కెట్ ప్రాంతంలో చోటుచేసుకుంది. బుర్ఖా ధరించిన మహిళ మరో వ్యక్తితో కలిసి అనుమానాస్పదంగా తిరుగుతుండడంతో పిల్లలను కిడ్నాప్ చేసేవారి భావించి స్థానికులు వారిని పట్టుకునే ప్రయత్నం చేశారు. వారికి చిక్కిన మహిళపై దాడి చేసి పోలీసులకు అప్పగించారు. పోలీసులు సదరు మహిళను విచారిస్తున్నారు. బుర్ఖా ధరించి వచ్చిన మహిళపేరు లక్ష్మిగా గుర్తించినట్లు సమాచారం.

నగరంలో గంజాయి పట్టివేత

- నలుగురు యువకులు, ఓ బాలుడు అరెస్ట్



ఖలీల్‌వాడి: నగరంలోని నాల్గో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఓ ఇంటిపై దాడి చేసి గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు టౌన్ సీఐ శ్రీనివాసరాజు తెలిపారు. టౌన్ సర్కిల్ కార్యాలయంలో శుక్రవారం కేసుకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. పక్కా సమాచారం మేరకు ఎస్సై శ్రీకాంత్ తన బృందంతో కలిసి వినాయకనగర్‌లోని ఓ ఇంటిపై దాడి చేయగా 461 గ్రాముల గంజాయి పట్టుబడిందన్నారు. నలుగురు యువకులు ఆకాశ్, రోహిత్‌కుమార్, శివరాణా రామతేజ్ రెడ్డి, రాకేశ్‌తోపాటు ఓ బాలుడిని అదుపులోకి తీసుకున్నారన్నారు. వారి వద్ద నుంచి గంజాయితోపాటు ఐదు సెల్‌ఫోన్‌లు, రెండు మోటార్ సైకిళ్లు, ఓ కారు, గంజాయి ప్యాకింగ్‌కు ఉపయోగించే 18 ఖాళీ ప్లాస్టిక్ కవర్స్‌ను స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. పట్టుబడిన వారిపై ఎన్‌డీపీఎస్ యాక్ట్ ప్రకారం కేసు నమోదు చేశామన్నారు. ఐదుగురిని అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించామని అన్నారు. తల్లిదండ్రులు, విద్యాసంస్థల బాధ్యులు పిల్లల కదలికలపై దృష్టి సారించాలని కోరారు.

చైనా మాంజా పట్టివేత



ఖలీల్‌వాడి: నగరంలోని రెండో టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఉన్న పతంగుల దుకాణాలపై ఇన్‌చార్జి సీపీ సింధుశర్మ ఆదేశాల మేరకు టాస్క్‌ఫోర్స్ ఏసీపీ నాగేంద్రచారి ఆధ్వర్యంలో టాస్క్‌ఫోర్స్, సీసీఎస్ సిబ్బంది దాడి చేశారు. రూ.10వేల విలువైన చైనా మాంజా స్వాధీనం చేసుకున్నారు. చైనా మాంజా నిల్వ చేసిన వారిని రెండో టౌన్ పోలీస్‌స్టేషన్ ఎస్సై యాసిన్ అరాఫత్‌కు అప్పగించారు. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ అంజయ్య, సీసీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అప్పుల బాధతో యువకుడి బలవన్మరణం



భరత్‌కుమార్(ఫైల్)

రాజంపేట: మండలంలోని ఆర్గొండ గ్రామానికి చెందిన చౌదరి రాజశేఖర్(27) అనే యువకుడు అప్పుల బాధ తాళలేక బలవన్మరణానికి పాల్పడ్డాడు. మృతుడి కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. చౌదరి సిద్ధరాములు చిన్న కుమారుడు చౌదరి రాజశేఖర్ గతంలోఉపాధి కోసం గల్ఫ్‌దేశాలకు వెళ్లి సరైన ఉపాధి లభించక ఇంటికి తిరిగి వచ్చేశాడు. ప్రస్తుతం హైదరాబాద్‌లో ప్రైవేటు జాబ్ చేస్తున్నాడు. సంక్రాంతి పండుగకు నాలుగు రోజుల క్రితం ఆర్గొండకు వచ్చాడు. ఆర్థిక సమస్యలపై పలుమార్లు కుటుంబ సభ్యులతో చర్చించిన రాజశేఖర్ గురువారం రాత్రి 10.30 గంటలకు పొలం వద్దకు వెళ్లి పడుకుంటానని ఇంట్లో వారికి చెప్పి వెళ్లాడు. ఉదయం ఇంటికి తిరిగి రాలేదు. రాజశేఖర్ బసవేశ్వర ఆలయ పరిధిలోని చెట్టుకు బెడ్‌షీట్‌తో ఉరేసుకుని కనిపించడంతో గ్రామానికి చెందిన తుల నరేశ్‌కు కుటుంబ సభ్యులకు సమాచారం అందించాడు. మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై సుభాషిణి తెలిపారు.

ఆర్థిక ఇబ్బందులతో విరక్తి చెంది..

దోమకొండ: మండల కేంద్రానికి చెందిన సామల భరత్‌కుమార్(34) గురువారం రాత్రి పురుగుల మందు తాగగా, చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారుజామున మృతి చెందినట్లు ఏఎస్సై సుబ్రమణ్యాచారి తెలిపారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందుతాగి భరత్‌కుమార్ పడిపోగా, కొద్ది సేపటి తరువాత కుటుంబసభ్యులు గమనించి అంబులెన్స్‌లో కామారెడ్డి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం అక్కడికి నుంచి హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి మృతి చెందాడు. ఇంట్లో ఆర్థిక సమస్యల కారణంగా జీవితంపై విరక్తి చెంది భరత్‌కుమార్ ఆత్మహత్య చేసుకున్నట్లు తండ్రి కృష్ణమూర్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

ఉరేసుకుని దయాలసిస్ పేషెంట్..

దోమకొండ: కిడ్నీలు చెడిపోయి దయాలసిస్ చేయించుకున్న వృద్ధుడు జీవితంపై విరక్తి చెంది ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రానికి చెందిన గొర్ల చంద్రయ్య(63) గత కొంతకాలంగా కిడ్నీ సమస్యతో బాధపడుతూ దయాలసిస్ చేయించుకుంటున్నాడు. ఏడాదిగా ఎన్ని ఆస్పత్రులు తిరిగినా ఫలితం లేకపోవడంతో జీవితంపై విరక్తి చెందిన శుక్రవారం ఎవరూ లేని గొర్రెల కొట్టంలో ఉరేసుకున్నాడు. మృతుడి భార్య ఎల్లవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై సుబ్రహ్మణ్యాచారి తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): ఎదురెదురుగా రెండు బైక్‌లు ఢీకొన్న ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన మండలకేంద్రంలోని గోపాల్‌పేటలో శుక్రవారం చో టు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని మాసాన్‌పల్లికి చెందిన పెద్దఒంటరి శ్రీనివాస్‌రెడ్డి తన బైక్‌పై గోపాల్‌పేట నుంచి స్వగ్రామానికి బయల్దేరాడు. జప్తిజాన్కంపల్లికి చెందిన సొల్లు రాములు గోపాల్‌పేట వైపు వస్తుండగా అదే గ్రామానికి చెందిన తుమ్మ సమత లిఫ్ట్ అడగగా బైక్‌పై ఇద్దరు బయల్దేరారు. ఈ క్రమంలో గోపాల్‌పేట సమీపంలో శ్రీనివాస్‌రెడ్డి, రాములు బైక్‌లు ఎదురెదురుగా ఢీకొన్నాయి. శ్రీనివాస్‌రెడ్డి తలకు బలమైన గాయాలు కాగా, రాములు, సమత కాళ్లు విరిగాయి. సమాచారం అందుకున్న ఎస్సై మల్లారెడ్డి ఘటనాస్థలానికి చేరుకొని క్షతగాత్రులను 108 అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం మెదక్ ఆస్పత్రికి తరలించారు.

నగల షాపులో చోరీ : కిలో వెండి అపహరణ



షాపును పరిశీలిస్తున్న ఎస్సై షరీఫ్

డిచ్‌పల్లి: మండల కేంద్రంలోని హేమశ్రీ సిల్వర్ మర్చంట్‌లో దుండగులు గురువారం రాత్రి చోరీకి పాల్పడి కిలో వెండి ఎత్తుకెళ్లారు. షాపు యజమాని శ్రీరాముల లక్ష్మీనర్సయ్య, పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.. లక్ష్మీనర్సయ్య రోజూలాగే గురువారం రాత్రి 8గంటలకు దుకాణాన్ని మూసివేసి ఇంటికి వెళ్లాడు. శుక్రవారం ఉదయం 10గంటలకు షాపు తెరిచేందుకురాగా, షటర్ తాళాలు పగులగొట్టి కనిపించాయి. షటర్‌ను ఎత్తి చూడగా దుకాణంలోని కౌంటర్‌ను ధ్వంసంచేసి దుండగులు కిలో వెండి ఆభరణాలను ఎత్తుకెళ్లినట్లు గుర్తించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించగా, వారు ఘటనాస్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. సీసీ కెమెరా హార్డ్ డిస్క్‌ను దుండగులు ధ్వంసం చేశారు. బంగారు ఆభరణాలను దాచిన లాకర్‌ను ధ్వంసం చేసేందుకు దండుగులు యత్నించి విఫలమయ్యారు. ఎస్సై ఎండీ షరీఫ్ క్లూస్ టీమును రప్పించి ఆధారాలు సేకరించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నామన్నారు. పోలీస్ స్టేషన్‌కు సమీపంలో డిచ్‌పల్లి – నిజామాబాద్ ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న నగల దుకాణంలో చోరీ జరగడం కలకలం రేపింది. వరుస దొంగతనాలతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు.

హత్య కేసులో నిందితుల అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న అడిషనల్ డీసీపీ బస్వారెడ్డి

పెర్కిట్(ఆర్మూర్): ఆర్మూర్ పట్టణంలో ఇటీవల జరిగిన మైలారం సోమేశ్ హత్య కేసులో నిందితులను అరెస్టు చేసినట్లు డీసీపీ బస్వారెడ్డి తెలిపారు. ఏసీపీ వెంకటేశ్వర్‌రెడ్డితో కలిసి శుక్రవారం ఆర్మూర్ పోలీస్ స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. ప్లాస్టిక్ సామగ్రి ఏరుకుంటూ జీవిస్తున్న మైలారం సోమేశ్‌ను పట్టణంలోని సిద్దులగుట్ట వెనుక ప్రాంతంలో బుధవారం అర్ధరాత్రి దుండగులు కర్రలతో కొట్టి, కత్తెరతో పొడిచి హత్య చేశారన్నారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టిన పోలీసులు ప్లాస్టిక్ సామగ్రి ఏరుకుని జీవిస్తున్న కనపర్తి సత్యనారాయణ, కనపర్తి రాజు, బడే రవిని అదుపులోకి తీసుకుని విచారించగా నేరం అంగీకరించారన్నారు. డబ్బుల విషయంలో గొడవ జరగడంతో హత్య చేశామని ఒప్పుకున్నారని డీసీపీ తెలిపారు.

వైన్‌షాపులో చోరీకి యత్నం కేసులో..

మామిడిపల్లి ప్రాంతంలోని 44వ నంబర్ జాతీయ రహదారి పక్కన ఉన్న లక్ష్మీనరసింహ వైన్‌షాపులో మూడు రోజుల క్రితం చోరీకి యత్నించిన ముగ్గురిని అరెస్టు చేసినట్లు డీసీపీ బస్వారెడ్డి తెలిపారు. ఆదిలాబాద్ జిల్లాకు చెందిన చౌహాన్ రవి, షేక్ షూబ్, గణేశ్ అనే ముగ్గురు ఈ నెల 8వ తేదీన కారులో వచ్చి చోరీకి యత్నించారన్నారు. అదే సమయంలో పెట్రోలింగ్ వాహనం రావడంతో పారిపోయే ప్రయత్నం చేయగా తమ సిబ్బంది వెంబడించి పట్టుకుని విచారించారన్నారు. బాల్కొండ, మెట్‌పల్లి, జగిత్యాల, కోరుట్ల, మునునూరు, ఇబ్రహీంపట్నం, మరిపెడ, డిచ్‌పల్లి పోలీస్ స్టేషన్ల పరిధిలో చోరీలకు పాల్పడినట్లు నిందితులు అంగీకరించినట్లు తెలిపారు. నిందితులను అరెస్టు చేసి వారి నుంచి ఒక కారు, రెండు పల్సర్ బైక్‌లు, రూ.2 వేల నగదు, మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో చాకచక్యం గ్యావహరించిన సిబ్బందికి డీసీపీ రివార్డులు అందజేశారు. ఎస్‌హెచ్‌వో సత్య నారాయణ, ఎస్సైలు గోవింద్, మహేశ్, హెడ్ కానిస్టేబుల్ తిరుపతి తదితరులు పాల్గొన్నారు.